
క్లుప్తంగా

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



యజ్ఞోపవీత ధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

వెంకట్రావు కుటుంబ సభ్యులకు మంత్రి రాజశేఖర్ ఓదార్పు



ఎడ్ల వెంకట్రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి రాజశేఖర్

సింహాచలం: చందనోత్సవం రోజు సింహాచలం కొండపై గోడ కూలి మృతిచెందిన పాత అడవివరం నివాసి, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి ఎడ్ల వెంకట్రావు కుటుంబాన్ని ఐఎన్‌టీయూసీ ప్రతినిధి, వైఎస్సార్‌సీపీ నాయకుడు మంత్రి రాజశేఖర్ సోమవారం పరామర్శించారు. వెంకట్రావు నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. స్టీల్‌ప్లాంట్ నుంచి రావాల్సిన అన్ని ప్రయోజనాలు వెంటనే వచ్చేలా తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు పి.వి.రమణమూర్తి ఉన్నారు.

ఆర్టీసీ డిపో మేనేజర్‌కు అభినందన సత్కారం



కొత్త డీఎం శరత్‌బాబును సత్కరిస్తున్న యల్లపు రాంబాబు తదితరులు

సింహాచలం: సింహాచలం ఆర్టీసీ డిపో మేనేజర్‌గా ఇటీవల బాధ్యతలు తీసుకున్న శరత్‌బాబును ఆర్టీసీ విశాఖ జిల్లా జైభీమ్ అసోసియేషన్ ప్రతినిధులు కలిసి అభినందనలు తెలిపారు. ఆయన్ని దుశ్శాలువాతో సత్కరించారు. సింహాచలం డిపోను మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ జైభీమ్ అసోసియేషన్ కమిటీ జిల్లా సెక్రటరీ యల్లపు రాంబాబు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రుద్ర్య, జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీతను ఆచరించాలి

సింహాచలం: విద్యార్థులంతా భగవద్గీత గొప్పతనం తెలుసుకుని, దాన్ని ఆచరించాలని గీతా ప్రచార సాధకులు మిందీ బాబ్జి వాసుదేవ తెలిపారు. అడవివరం గ్రంథాలయంలో గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో సోమవారం విద్యార్థులకు భగవద్గీత విశిష్టతను వివరించారు. ప్రతి రోజూ భగవద్గీత శ్లోకాలను పారాయణం చేయడం అలవర్చుకోవాలన్నారు. భగవద్గీతలోని శ్లోకాలను సులభతరంగా ఎలా పఠించాలో నేర్పించారు. అనంతరం జనరల్ నాలెడ్జ్ అంశాల్లో అవగాహన కోసం రాష్ట్ర, దేశ, ప్రపంచ పటముల గుర్తింపు, నీతికథలు, విద్య ఆవశ్యకత తదితర అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎన్‌వీ నరసింహం, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పాలెపు బంగారు చిట్టి, కార్మిక నాయకుడు సీహెచ్ సూర్యనారాయణరాజు, కేఎస్ఆర్ మూర్తి, గ్రంథాలయ ఉద్యోగి ఎల్లమ్మ, పాఠకులు భానుమూర్తి, లూసీ కిరణ్, అజయ్, మోహన్, శంకర్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ వ్యాకరణంపై శిక్షణ



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

పెందుర్తి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో కథలు చదవడం, రాయడం, చెప్పడంపై విద్యార్థులకు సోమవారం శిక్షణ ఇచ్చారు. నీతి అనే అంశంపై పలు ఉదాహరణలతో ఉపాధ్యాయురాలు చంద్రకళ వివరించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు ఈ.వెంకటేశ్వరరావు ఇంగ్లిష్ గ్రామర్‌పై అవగాహన కలిగించారు. గ్రంథాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ పెతకంశెట్టి భూలోకరావు మజ్జిగ వితరణ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు ఆదారి రామకృష్ణ, పెంటకోట గణేష్, పాఠకులు పాల్గొన్నారు.

మేయర్ గారూ.. ఇదేనా మీ తీరు!



96వ వార్డు సాయిదివ్యనగర్‌లో ప్రధాన రోడ్డు దుస్థితి



అధ్వానంగా ఉన్న సాయిదివ్యనగర్ కాలనీలోని రోడ్డు

'అప్పటికే నిక్షేపంగా ఉన్న రోడ్ల మీద మరోసారి రోడ్లు వేశారు. శుభ్రంగా ఉన్న కాలువలను మళ్లీ కట్టారు. తమకు అనుకూలంగా ఉన్న కాలనీల్లో వద్దన్నా అభివృద్ధి పనులు చేపట్టారు. రూ.లక్షల్లో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు. కానీ.. దీర్ఘకాలికంగా అభివృద్ధికి దూరంగా ఉన్న కాలనీలను పట్టించుకోలేదు. మట్టి రోడ్ల మీదే ఆ కాలనీల ప్రజల ప్రయాణం. ఇళ్ల చుట్టూ నిలిచిన మురుగుతో దోమలు, ఈగల మధ్యే వారి జీవనం. వీధి దీపాలు కూడా సక్రమంగా లేక విష కీటకాలతో భయం భయంగా బతకాల్సిన పరిస్థితి'.. ఇదీ కొత్త మేయర్ పీలా శ్రీనివాసరావు ప్రాతినిధ్యం వహిస్తున్న జీవీఎంసీ 96వ వార్డు దుస్థితి.

- మట్టి రోడ్లతో అవస్థలు పడుతున్న సాయిదివ్యనగర్ వాసులు
- కాలనీలో కానరాని డ్రైనేజీ అవుట్‌లెట్ సదుపాయం
- వెలగని వీధిదీపాలు.. పట్టించుకోని జీవీఎంసీ
- ఇంటికి పక్కనే ఉన్నా.. కాలనీ ప్రజల గోడు పట్టించుకోని మేయర్



బాగున్న రోడ్డుపైనే కొత్తగా వేస్తున్న రోడ్డు(ఫైల్)

పెందుర్తి:కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల కాలంలో కొన్ని కాలనీలపై తల్లి ప్రేమ.. మరి కొన్ని కాలనీలపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారు. పీలా శ్రీనివాసరావు ఇంటికి అతి సమీపంలో ఉన్న సాయిదివ్యకాలనీ దుస్థితే ఇందుకు ఉదాహరణ. ఈ కాలనీలో ఇప్పటికీ మట్టి రోడ్లే దర్శనమిస్తున్నాయి. మురుగు కాలువల గురించి అడగాల్సిన పనే లేదు. వీధి దీపాల కాంతి అంతంత మాత్రమే. దీంతో కాలనీ వాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

అరకొర వసతుల మధ్యే..

సాయిదివ్యనగర్‌లో దాదాపు 100 కుటుంబాలకు పైనే నివాసం ఉంటున్నాయి. అయితే ఈ కాలనీలో కనీస మౌలిక వసతుల కల్పనపై అధికారులు, పాలకులు పెద్దగా దృష్టి సారించలేదు. కాలనీకి వెళ్లే ప్రధాన మార్గం మట్టి రోడ్డే. ఇక కాలనీ అంతర్గత రోడ్ల గురించి చెప్పుకోవాల్సిన పరిస్థితేలేదు. మురుగు కాలువలు గానీ, అవుట్ లెట్ సదుపాయం గానీ అస్సలుకే లేదు. చివరకు మొక్కుబడిగా విద్యుత్ స్తంభాలు వేసినా వాటికి వీధి దీపాలు అమర్చాలన్న విషయాన్నే మర్చిపోయారు. దీంతో రాత్రి వేళ కాలనీ చిమ్మచీకట్లో ఉంటుంది. దీనిపై ఎన్నిసార్లు స్థానికులు మొరపెట్టుకున్నా.. అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. కాలనీలో ఉన్న మూడు పార్కులు కూడా అభివృద్ధికి నోచుకోలేదు.

కలిసొచ్చే చోటే.. అభివృద్ధి!

నియోజకవర్గ కేంద్రమైన పెందుర్తిలోని జీవీఎంసీ 96వ వార్డులో గత పది మాసాలుగా అభివృద్ధి పనుల్లో చిత్రవిచిత్రాలు చోటు చేసుకుంటున్నాయి. వార్డు కార్పొరేటర్‌గా ఉన్న పీలా శ్రీనివాసరావు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జీవీఎంసీ నుంచి భారీగా నిధులు రాబట్టుకున్నారు. అయితే ఆయా నిధులతో ప్రజలకు అవసరమైన చోట అభివృద్ధి పనులు చేపట్టలేదు. అప్పటికే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మించిన రోడ్లపై మళ్లీ రోడ్లు వేసి విమర్శలు పాలయ్యారు. చాలా కాలనీల్లో రోడ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ప్రజలు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా.. ఫలితం లేదు. అలాంటి దుస్థితే సాయిదివ్యనగర్‌కు పట్టింది. తమకు బాగా కలిసొచ్చే పనులు చేపట్టారు తప్ప.. ప్రజలకు కావాల్సిన పనుల్ని మాత్రం చేయలేదన్న అపవ్రద మూటగట్టుకున్నారు.

ఈ కాలనీకి గత జీవీఎంసీ ఎన్నికల సమయంలో ప్రచారానికి వెళ్లిన ప్రస్తుత మేయర్ పీలా చాలా హామీలు గుప్పించారు. రోడ్లు, కాలువలు, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. తీరా కార్పొరేటర్‌గా గెలిచి, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ కాలనీని పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా స్పందించి కాలనీని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

చాలా ఇబ్బందులు పడుతున్నాం..



మా కాలనీకి రోడ్లు పూర్తిగా లేవు. కనీసం గొయ్యిలు ఉన్న చోట మట్టితో కూడా పూడ్చడం లేదు. దీంతో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రజాప్రతినిధులకు, అధికారులకు అనేకసార్లు మొరపెట్టుకున్నాం. ఎన్నికల సమయంలో హామీలిచ్చారు. ఇప్పుడు పట్టించుకోవడం లేదు.

– ఎస్.సూరిబాబు, కాలనీవాసి, సాయిదివ్యనగర్

దోమలు, ఈగలతో బెడద



కాలనీలో మురుగునీరు పోయేందుకు వీలుగా అవుట్‌లెట్ సదుపాయం లేదు. దీంతో వాడుక నీరు, వర్షపు నీరు కాలనీలోనే నిలిచిపోతుంది. దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతున్నాయి. వీధి దీపాలు లేక రాత్రి సమయంలో మహిళలు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. పార్కు స్థలాలు ఉన్నా అవి ఎందుకూ పనికిరావట్లేదు.

– జి.రఘు, కాలనీ వాసి

8న బ్రాహ్మణి ముత్యమాంబ పండగ



బ్రాహ్మణి ముత్యమాంబ

పరవాడ: మండల కేంద్రమైన పరవాడ గ్రామంలో కొలువుదీరిన బ్రాహ్మణి ముత్యమాంబ పండగను ఈ నెల 8న అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఆ రోజు వేకువజాము నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే అశేష భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన ఉంటుందన్నారు. సాయంత్రం అమ్మవారిని పుర వీధుల్లో డప్పువాయిద్యాలు నడుమ ఊరేగించి అనుపు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.

పీజీఆర్ఎస్‌కు 8 వినతులు



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ హేమావతి

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్–8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి వివిధ సమస్యలపై 8 వినతులు అందాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన కార్యక్రమంలో ప్రజల నుంచి జోనల్ కమిషనర్ హేమావతి వినతులు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, విచారణ జరిపి, తగు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. జోన్–8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుడుతున్న అర్చకులు

పెందుర్తి:స్థానిక వేంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, అంకురార్పణ, యాగాశాల అర్చన, అగ్ని ప్రతిష్ఠ జరిగాయి. వెంకన్నకు ప్రత్యేక పూజలు చేశారు. ఐదు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం ధ్వజారోహణ, హోమాలు చేస్తారు. మూడోరోజు సాయంత్రం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. నాలుగో రోజు గురువారం తిరువీధి ఉత్సవంలో భాగంగా స్వామివారి రథోత్సవం సాగనుంది. ఆఖరి రోజు శుక్రవారం ఉదయం స్వామివారికి చక్రస్నానం, చక్రత్తాళ్వారులతో కలిసి దివ్య స్నానమాచరిస్తారు. సాయంత్రం పుష్పయాగం, మహా పూర్ణాహుతి, ద్వాదశారాధన, ఊంజల్ సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రతినిధులు వెల్లడించారు.

ఉమాచంద్రమౌళీశ్వరుడికి పూజలు

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామికి విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

పదో తరగతి టాపర్లకు ఆత్మీయ సత్కారం



సత్కారం పొందిన హెచ్‌ఎం చిన్నమ్మాయి, టెన్త్ టాపర్లతో వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు

పెందుర్తి: పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులను వెంకటాద్రి వాకర్స్ క్లబ్ ప్రతినిధులు సోమవారం ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం చిన్నమ్మాయితో పాటు ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులను దుశ్శాలువాలతో సత్కరించి, బహుమతులు అందించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ప్రతినిధులు జి.గోవిందరావు(సీఐ), జి.ఎస్.ప్రకాశరావు, అన్నపూర్ణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ్‌కుమార్‌కు సత్కారం



శ్రావణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న అమర్‌నాథ్, ధర్మశ్రీ, అదీప్‌రాజ్ తదితరులు

పరవాడ: వైఎస్సార్‌సీపీ పరవాడ మండల యువజన విభాగం అధ్యక్షుడిగా నియమితుడైన మండలంలోని నాయుడుపాలెం గ్రామానికి చెందిన బండారు శ్రావణ్‌కుమార్‌ను పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ శాలువ కప్పి, సత్కరించారు. సబ్బవరంలో ఆదివారం రాత్రి జరిగిన పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన అమర్‌నాథ్ చేతుల మీదుగా శ్రావణ్‌కుమార్‌కు సన్మానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు కృషి చేసి, పార్టీకి పూర్వ వైభవం తీసుకు రావాలని శ్రావణ్‌కుమార్‌కు సూచించారు. నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ నాయకత్వంలో పార్టీ పురోభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని శ్రావణ్‌కుమార్ అన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, అదీప్‌రాజ్, రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దొంగతనాలు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తం

పరవాడ: దొంగతనాలు, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనల పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ సూచించారు. గొర్లివానిపాలెం పోర్టుకో లేఅవుట్‌లో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. దొంగతనాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరు గృహ సముదాయాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అధికారికంగా అనుమతి పొందిన యాప్స్‌ను మాత్రమే ఉపయోగించాలన్నారు. బెట్టింగ్ యాప్స్‌ను వినియోగించ కూడదన్నారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలు జరిగితే 1930 టోల్ ఫ్రీ నంబరుకు సమాచారం అందించాలని సూచించారు. సదస్సులో పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు, పోర్టుకో కమ్యూనిటీ అధ్యక్షుడు ఇ.కాశీప్రసాద్, కార్యదర్శి అమరేంద్ర, కాలనీ వాసులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన 8 మందికి కోర్టు రూ.80 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు తెలిపారు. సోమవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా, జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు వెల్లడించారు. పట్టణ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

'అంగన్‌వాడీ కార్యకర్తపై వేధింపులు తగదు'



ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పరవాడ: రావాడ అంగన్‌వాడీ కార్యకర్తపై వేధింపులకు పాల్పడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో లలితకుమారి, రావాడ సర్పంచ్ మోటూరి సన్యాసినాయుడులపై చర్యలు తీసుకోవాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట సిటు ఆధ్వర్యంలో మండల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు సోమవారం ధర్నా నిర్వహించి, అధికారులకు వినతిపత్రం అందించారు. అనంతరం గనిశెట్టి మాట్లాడుతూ రావాడ సర్పంచ్ మోటూరి సన్యాసినాయుడు అంగన్‌వాడీ కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ నెల 2న గ్రామంలో నిర్వహించిన కిశోర వికాస కార్యక్రమానికి, స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తకు ఎలాంటి సంబంధం లేకపోయినా సదరు అంగన్‌వాడీ కార్యకర్తలపై రాజకీయ వేధింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. తన రాజకీయ ఆధిపత్యం కోసం అంగన్‌వాడీ కార్యకర్తను బలిచేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఐసీడీఎస్ సీడీపీవో లలితకుమారి ద్వారా మెమో జారీ చేయించి, సోషల్ మీడియాలో అన్ని గ్రూపులకు పంపించి అంగన్‌వాడీ కార్యకర్తను వేధిస్తున్న సర్పంచ్, సీడీపీవోపై విచారణ జరిపి, శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు సీహెచ్ దేవి, ఎం.అమ్మాజి, రత్నం, వెంకటలక్ష్మి, పార్వతి, రాణి పాల్గొన్నారు.

'ఉపాధి' ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి

- గ్రామ పంచాయతీ ఉద్యోగులుగా గుర్తించాలి
- పెందుర్తి, ఆనందపురం, భీమిలి, పద్మనాభం ఫీల్డ్ అసిస్టెంట్‌ల వినతి



ఎమ్మెల్యే పంచకర్లకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌లు

పెందుర్తి: తాము రాజకీయంగా ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పెందుర్తి, ఆనందపురం, భీమిలి, పద్మనాభం మండలాల ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌లు సోమవారం మంగళగిరిలో జనసేన పార్టీ ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం అందించారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుకు వినతిపత్రం అందించి, తమ సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రి కాగానే తమ బతుకులు మారుతాయని అనుకున్నామన్నారు. కానీ ప్రభుత్వం ఏర్పడిన నుంచి గతంలో ఎన్నడూ లేనంతగా రాజకీయ వేధింపులకు గురవుతున్నట్లు వాపోయారు. చివరకు గ్రామ స్థాయి నాయకులు కూడా తమను అన్నిరకాలుగా బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 19 ఏళ్లుగా పనిచేస్తున్న తమ విధులను క్రమబద్ధీకరించి, గ్రామ పంచాయతీ ఉద్యోగిగా నియామకం జరపాలని కోరారు. హెచ్ఆర్ పాలసీ ప్రకారం హెల్త్‌కార్డులు, ప్రమాద బీమా, గ్రాట్యుటీ వంటి ప్రయోజనాలు కల్పించాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో పనిచేస్తున్న అన్ని కేటగిరీల వారికి పెంచిన విధంగా తమకూ వేతనాలు పెంచాలన్నారు. విద్యార్హతలను బట్టి కంప్యూటర్ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతులు కల్పించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ వద్ద ధర్నా



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దళిత, ప్రజా సంఘాల నాయకులు

మహారాణిపేట: చినముషిడివాడ ఆక్సిజన్ డిఫెన్స్ కాలనీలో అంబేడ్కర్ విగ్రహం తొలగించడం తగదని ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో విశాఖ జిల్లా కలెక్టర్‌కు దళిత ప్రజా సంఘాల నాయకులు సోమవారం ఫిర్యాదు చేశారు. రాజేష్ అనే వ్యక్తి కబ్జాలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకుని, దాన్ని అందరికీ ఉపయోగపడేలా మినీ పార్కుగా మార్చి, మిగిలిన స్థలంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్, ఓపెన్ స్పేస్‌గా ఉంచి, మినీ పార్క్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు దళిత సంఘాల నాయకులు తెలిపారు. కలెక్టర్‌ను కలిసినవారిలో భీమ్ సేన వార్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వసంత రాజేంద్రప్రసాద్, పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, ఇప్టు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, వివిధ సంఘాల ప్రతినిధులు ఉన్నారు.

ఇళ్ల పట్టాల మంజూరుకు ఆందోళన

చినముషిడి వాడ రెవెన్యూ పరిధిలో పదేళ్లుగా నివసిస్తున్న 150 మంది కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.30 ద్వారా ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా నాయకులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. సీపీఐ నేతలు ఎం.పైడిరాజు, ఆర్ శ్రీనివాసరావు, వై.రాంబాబు, ఎ.అన్నపూర్ణ పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయం ఎదుట మీడియాతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ఘనంగా కార్ల్ మార్క్స్ జయంతి



కార్ల్‌మార్క్స్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

పెందుర్తి: కమ్యూనిస్ట్ పితామహుడు కార్ల్ మార్క్స్ 207వ జయంతిని జీవీఎంసీ 97వ వార్డు బర్ధన్‌నగర్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. మార్క్స్ చిత్రపటానికి సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిల్ల పైడిరాజు పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సృష్టి ఉన్నంత వరకు ఆయన రాసిన పెట్టుబడి గ్రంథం మూడు సంపుటిలకు అంతం లేదన్నారు. సీపీఐ నాయకులు ఆర్.శ్రీనివాస్, వై.రాంబాబు, అన్నపూర్ణ, అసిరినాయుడు, త్రినాథ్, రమణ, యోగి, అరుణ, రజని, దుర్గారావు, అప్పారావు పాల్గొన్నారు.

అభివృద్ధితోపాటు సంక్షేమం



పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న కొల్లు రవీంద్ర

సబ్బవరం: కూటమి ప్రభుత్వం అభివృద్ధితో పాటు, సంక్షేమ పథకాలను అందిస్తూ ముందుకు సాగుతోందని అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సబ్బవరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో సోమవారం నిర్వహించిన టీడీపీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. పార్టీ అనుబంధ సంఘాలు, గ్రామ కమిటీలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఏపీ అయిల్‌ఫెడ్ చైర్మన్ గండి బాబ్జీ, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య, మాజీ ఎంపీపీ గండి దేముడు, కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.